కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి


డ్రిప్ ఇరిగేషన్ విధానంలో సాగు చేస్తున్న బీర


లక్ష్మణేశ్వరంలో ఏపుగా పెరిగిన వంగ తోట


వంగా తోటకు మందులు పిచికారీ చేస్తున్న రైతు.

- తీర ప్రాంతంలో పెరిగిన సాగు విస్తీర్ణం
- లాభదాయకంగా ఉండడంతో సాగు ముందుకు

నరసాపురం రూరల్: శివారు ప్రాంతమైన నరసాపురం మండలంలో వరి, ఆక్వా సాగు చేసే రైతుల సంఖ్య తగ్గి కూరగాయల సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కాలంలో పండించిన కూరగాలయకు మద్దతు ధర లభిస్తుండటంతో క్రమేపి ఈ సాగులోకి ప్రవేశించే రైతుల సంఖ్య పెరుగుతోంది. మండలంలోని రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం, సీతారామపురం, సారవ, ఎల్బీచర్ల, తూర్పుతాళ్లు, చామకూరిపాలెం, యర్రంశెట్టివారిపాలెం తదితర గ్రామాలతో పాటు మొగల్తూరు గ్రామంలోని మరికొన్ని గ్రామాలు కూరగాయల సాగుకు అనువైన ప్రాంతాలుగా ఉన్నాయి. కూరగాయలకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో ఇటీవల కాలంలో కూరగాయల సాగు చేసే రైతు సంఖ్యతో పాటు సాగు విస్తీర్ణం కూడ పెరిగిందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సారవ, పితానిమెరక, సీతారామపురం గ్రామాల్లో వంగ సాగు ఎక్కువగా సాగుతోంది. ఈ తోటల్లోనే బీర సాగునుకూడా సాగు చేస్తున్నారు. పెన్నాడ వంకాయల సాగు లాభదాయకంగా ఉందని ఎకరాకు రూ.50 వేల వరకూ ఖర్చు అవుతోందని ఆరు నెలల పాటు పంట దిగుబడి వస్తుందని, ప్రకృతి అనుకూలించి ధరలు బాగుంటే ఖర్చులు పోనూ లక్ష రూపాయల వరకూ లాభం వస్తుందని, ఎకరాకు రూ.20వేలు లీజు చెల్లిస్తున్నామన్నారు.

డ్రిప్ ద్వారా నీటి పొదుపు

ఆధునిక టెక్నాలజీ వినియోగించి బీర సాగు చేస్తున్నానని ఫలితంగా నీటిని పొదుగా వాడుకునే అవకాశం ఏర్పడిందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు వృథా కాకుండా బీర పాదు మొదళ్లకు నీరు వెళుతుందన్నారు. అంతే కాకుండా ఈ విధానంలో కలుపు మొక్కల బెడద ఉండదన్నారు. ఎరువులు, పురుగు మందులు పిచికారి చేయాల్సిన లేకుండా డ్రిప్ విధానంలోని పైపు లైన్ల ద్వారా బీరపాదుల కుదుళ్లకే నేరుగా అందించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు పంట ఎదుగుదల కూడా బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ కూరగాయల సాగు చేలల్లోనే రైతులు సర్వే మొక్కలను కూడా పెంచుతున్నారు. ఫలితంగా తాత్కాలికంగా ఆదాయం వచ్చే కూరగాయల సాగుతోపాటు దీర్ఘకాలంలో పంట చేతికి వచ్చే సర్వే సాగుతో రైతు రెండు విధాలా లాభాలు పొందుతున్నారు.

ఆదాయం బాగుంది



గత కొన్ని సంవత్సరాల నుంచి కూరగాయల సాగు చేస్తున్నాను. వరి, ఆక్వా సాగు కంటే కూరగాయల సాగులో ఆదాయం బాగుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నాను. ఒత్తిడి లేని సాగు చేస్తున్నాను. టెక్నాలజీని ఉపయోగించుకుని ఈ ఏడాది డ్రిప్ ఇరిగేష్ ద్వారా సాగు చేస్తున్నాను.

– ఉంగరాల నందికేశవరావు, కూరగాయల రైతు

తీగ జాతి తోటలకు ప్రోత్సాహకాలు



నరసాపురం మండలంలో సుమారు 20 ఎకరాల్లో సాగుచేస్తున్న 34 మంది రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.8వేలు చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థికం సహకారం అందించాం . దొండకు కాకుండా బీర, పొట్ల, ఆనప, గుమ్మడి తదితర తీగ జాతి పంటలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ప్రోత్సాహకం మరింత పెరగనుంది.

– ప్రియదర్శిని, ఉద్యానవన శాఖ అధికారి

లక్ష్మీపాలెం వద్ద ఏటిగట్టు ఎత్తును పెంచాలి


యలమంచిలి మండలం లక్ష్మీపాలెం లాకుల వద్ద ఏటిగట్టును పరిశీలిస్తున్న రైతులు

యలమంచిలి: లక్ష్మీపాలెం వద్ద ఏటిగట్టు ఎత్తును రెండు మీటర్లు పెంచాలని లక్ష్మీపాలెం పరిసర గ్రామాల రైతులు కోరుతున్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గోదావరికి ఇరువైపులా ఏటిగట్టు ఎత్తు పెంచేందుకు పనులు ప్రారంభించారు. 1986లో వచ్చిన వరదల లెవిల్ తీసుకుని దానికంటే రెండు మీటర్లు ఎత్తున ఏటిగట్టు ఎత్తు పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు గోదావరి కుడిగట్టు విజ్జేశ్వరం నుంచి బియ్యపుతిప్ప వరకు ఎత్తు పెంచుతూ పనులు పూర్తి చేశారు. సుమారు 90 శాతం పని పూర్తి చేశారు. అయితే కొన్ని ఇబ్బందులు వల్ల మిగిలిన 10 శాతం పని పూర్తి కాలేదు. ఆ విధంగా దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం గ్రామాల పరిధిలో కొంతమేర పనులు పూర్తి కాలేదు. ఆగస్టు నెలలో వచ్చే గోదావరి వరదలకు ప్రతిసారి ఈ మూడు గ్రామాలలో ఏటిగట్టుకు సమాంతరంగా వరద నీరు ప్రవహిస్తుండుటతో ఆ సమయంలో రైతులు, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా ఏటిగట్టుపై మట్టి బస్తాలు పరుస్తుంటారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆగిపోయిన పనులను పూర్తి చేయడానికి కన్జర్వెన్సీ అధికారులు టెండర్లు పిలిచారు. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం వద్ద ఏటిగట్టు ఎత్తు పెంచడానికి, లక్ష్మీపాలెం వద్ద అరమీటరు ఎత్తున రోడ్డు వేయడానికి టెండర్లు పిలిచినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన రైతులు లక్ష్మీపాలెం వద్ద కూడా ఎత్తు పెంచాలని కోరుతున్నారు. ఈ మేరకు గురువారం లాకుల వద్దకు చేరిన రైతులు ఇక్కడ ఎత్తు పెంచకపోతే వరదల సమయంలో ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లోని వేలాది ఎకరాల పంట భూములు నీట మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్మీపాలెం వద్ద ఏటిగట్టు ఎత్తు పెంచకుండా కేవలం అర మీటరు రోడ్డు వేస్తే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. ఇక్కడ కూడా రెండు మీటర్లు ఎత్తు పెంచి ఆ తరువాత రోడ్డు వేయాలని రైతులు పెన్మెత్స సత్యనారాయణరాజు, ఆరుమిల్లి లక్ష్మణరావు, పొత్తూరి సోమరాజు, తోటకూర చంటిరాజు, కుక్కల పుల్లారావు, వత్సవాయి సూర్యనారాయణరాజు, బోళ్ల శ్రీను, పేరిచర్ల వెంకన్నబాబు, పేరిచర్ల శ్రీనివాసరాజు తదితరులు కోరారు. అలా కాకుండా రోడ్డు మాత్రమే వేయాలని చూస్తే పనులు అడ్డుకుంటామని చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ బి.విజయ సారథి

పాలకొల్లు అర్బన్: ఇటీవల కుళాయి చెరువులో పడి మృతి చెందిన మతికాని హరికృష్ణ తల్లిదండ్రులకు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం మునిసిపల్ కమిషనర్ బి సారథి అందజేశారు. బంగారువారి చెరువు గట్టు ఎస్‌కేపీ అండ్ టీవీఆర్ మునిసిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఈ ఆర్థిక సహాయం అందించారు. స్థానిక పెద్దలు గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోద వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదు


బోద వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: బోద వ్యాధి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని భగ్గేశ్వరంలో గురువారం బోద వ్యాధిపై అవగాహన కల్పించారు. బోధవ్యాధితో బాధపడుతున్న రోగులను పరీక్షించి తీసుకోవలసిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. ఫైలేరియా యూనిట్ ఇన్‌చార్జ్ వై.బాలచంద్రుడు మాట్లాడుతూ క్యూలెక్స్ దోమ కుట్టడం వలన ఫైలేరియా వ్యాధి వస్తుందని, దోమ కుట్టిన తరువాత చంకల్లోనూ, గజ్జల్లోనూ బిల్లలు కడతాయన్నారు. చలి, జ్వరం వస్తుందని వెంటనే పరీక్షలు చేయించుకుని డీఈసీ మాత్రల ద్వారా చికిత్స పొందాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల కాళ్లకు పుండ్లు పడి ఇబ్బంది పడుతున్న వారికి శుభ్రం చేసుకోవడానికి కిట్లు ఇస్తామన్నారు. పుండ్లు పడిన కాళ్లు ఎలా శుభ్రం చేసుకోవాలో? అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్తిరాజు, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు సీహెచ్ లక్ష్మి, కె బేబీ తదితరులు పాల్గొన్నారు.

గట్లపై పాలిథీన్ షీట్లతో ఎన్నో లాభాలు


కాపవరంలో గట్లపై పాలిథీన్ షీట్లు కప్పిన దృశ్యం


లంకలకోడేరులో వరిచేను గట్టుపై పాలిథీన్ షీటు కప్పిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలో దాళ్వా వరి నాట్లు పూర్తయ్యాయి. రైతులు ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులను పాటించి వరి సాగు చేపట్టారు. యాజమాన్య పద్ధతుల్లో భాగంగా మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు గట్లపై పాలిథీన్ షీట్లు కప్పి నీటి యాజమాన్య పద్ధతులు పాటించారు. కాపవరం, లంకలకోడేరు, వెలివెల, తిల్లపూడి, శివదేవునిచిక్కాల, దగ్గులూరు, వెంకటాపురం, అరట్లకట్ట, పెదమామిడిపల్లి, ఆగర్రు, ఆగర్తిపాలెం తదితర గ్రామాల్లో వరిచేను గట్టుపై పాలిథిన్ షీట్లు కప్పి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి దాళ్వా సాగు చేపట్టారు. గట్లపై పాలిథీన్ షీట్లు కప్పడం వల్ల రైతులకు ప్రయోజనం కలగనుంది. దాళ్వా పంటకు ఎక్కువగా ఎలుకల బెడద ఉంటుంది. గట్లపై పచ్చగడ్డి పెరిగి ఎలుకలు పంటను నాశనం చేస్తాయి. ఎలుకల సమస్యను కూడా ఈ విధానంలో అరికట్టవచ్చని చెబుతున్నారు.

జాతి నిర్దేశకుడు గాంధీజీ


పాలకొల్లు అర్బన్: మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

నరసాపురం: గాంధీజీ జాతి నిర్దేశకుడని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కళాశాలలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సత్యనాయణ మాట్లాడుతూ నేటి తరం వారు గాంధీ చరిత్రను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ పీవీ సుబ్బారావు, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకరావు,హెచ్‌ఆర్డీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చినిమల్లి శ్రీనివాస్, పోలిశెట్టి రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజీబీఎస్ మహిళా కళాశాలలో..

బీజీబీఎస్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాలతో గాంధీజీ ప్రపంచ దృష్టిని ఆకర్షించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి, గోశాలలో గోవులకు గడ్డిని అందించారు.

పాలకొల్లులో..


పాలకొల్లు అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వరరావు (బాబు) పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రేపాక ప్రవీణ్‌భాను, సంఘ నాయకులు నాళం మాణిక్య శ్రీనివాస్ (బాబి), మన్యం జగ్గమ్మగారి సత్రం మాజీ చైర్మన్ నంబూరి శ్రీగంగాపవన్‌కుమార్, సలాది జనార్ధనరావు, మామిడి చినవెంకట శివయ్య, జంధ్య సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్‌లోగల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.టి రాజరాజేశ్వరి అధ్యక్షతన మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డా.ఎం రామకృష్ణ, కె పార్థసారథి, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నరసాపురం: వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రేపు విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన

ఆకివీడు: చేతి వృత్తిదారుల్లో నైపుణ్యం, ఆధునికత జోడించి, వారికి శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని తమ కళాశాలకు కేటాయించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీటీ.ప్రతాప్ కుమార్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1న పథకంపై అవగాహనా కార్యక్రమం ఆకివీడు వి.కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేశామన్నారు. చేతి వృత్తులకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ పనిలో నైపుణ్యం, నాణ్యత, ఆధునికీకరణ లేకపోవడంతో పోటీ ప్రపంచంలో తట్టుకోలేకపోతున్నారని ఆమె చెప్పారు. చేతి వృత్తి దారులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం, రుణాలు వంటి వాటిని తెలుసుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో చేతివృత్తులతో తయారు చేసిన వస్తువులకే మంచి డిమాండ్ వస్తుందన్నారు. కళాశాల పూర్వవిద్యార్థి డీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ పథకం మన దుంపగడప కళాశాలకు రావడం ఈ ప్రాంత వృత్తిదారులకు సువర్ణావకాశమన్నారు. ఈ సదస్సుకు చేతి వృత్తిదారులంతా హాజరుకావాలని కోరారు.

హామీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

భీమవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి మంతెన సీతారామ్ అన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో బి బలరామ్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీతారామ్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ అంటూ గొప్పగా ప్రచారంచేసి అధికారం చేపట్టాక వాటిలో ఒక్క పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలకు పెద్ద ఆశలు కల్పించారని, వాటిని అమలు చేయాల్సిన సమయంలో గత ముఖ్యమంత్రి ఖజానా అంతా నాశనం చేసేసాడని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం పన్నులు, టాక్సులు పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, నిర్వాశితుల సమస్యల ఊసెత్తడం లేదని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విక్రయం నిలిపివేసి దానికి గనులు కేటాయించాలని ఒక్క మాట మాట్లాడం లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జెఎన్వీ గోపాలన్, బి వాసుదేవరావు, కౌరుపెద్దిరాజు, కర్రా నాగేశ్వరరావు, పివి ప్రతాప్ తదితరలు పాల్గొన్నారు.

మాంసం విక్రయించిన వారికి జరిమానా

ఆకివీడు: గణతంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయించిన వారికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. అయితే ఆ రోజు మాంసం విక్రయాలను నిలుపుదల చేయాల్సిన అధికారులు కేవలం జరిమానాకే పరిమితమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. మొత్తం ఎనిమిది మంది మాంసం దుకాణదారుల వద్ద రూ.15 వేలు జరిమానా వసూలు చేశామని మేస్త్రీ సాకేత్‌ను వివరించారు.

అధ్వానంగా కోలనపల్లి- కుప్పనపూడి రోడ్డు


అధ్వానంగా ఉన్న కోలనపల్లి నుంచి కుప్పనపూడి వెళ్లే రహదారి

కాళ్ల: కోలనపల్లి నుంచి కుప్పనపూడి వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా ఉంది. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేపట్టినప్పటికీ కొన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రధానంగా కాళ్ల మండలం కోలనపల్లి గ్రామం నుంచి కుప్పనపూడి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టలేదు. అసలే అధ్వానంగా పెద్దపెద్ద గోతులతో ఉన్న రహదారి ప్రయాణం ఇబ్బందికరంగా ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. కాళ్ల నుంచి కోలనపల్లి గ్రామ శివారు వరకు, అదేవిధంగా ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామ పరిధి వరకు రహదారి నిర్మించారు. కానీ మధ్యలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులు వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి భారీ గోతులు ఉండటంతో వాహనదారులు ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అన్ని రహదారులు నిర్మించి ఈ రహదారికి కనీసం మరమ్మతులు చేయకపోవడం విచారకరమని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమేర జేసీబీ తో సరి చేసినప్పటికీ రహదారి మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు

నరసాపురం: ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.అజయ్య హెచ్చరించారు. గురువారం కమిషనర్ పట్టణంలోపలు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అమ్మకాలు సాగించే దుకాణాలపై దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మడానికి వీలు లేదన్నారు. నిబంధనలు అతిక్రమించి కవర్లు అమ్మకాలు సాగిస్తే భారీగా అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నుంచి పట్టణంలో పూర్తిగా ప్లాస్టిక్ వాడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వ్యాపారులు సహకరించాలని చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలి


స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: రెండవ కేటగిరిలోని విద్యుత్ కనెక్షన్స్‌కు స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రభుత్వ ఆదేశాలను నిరసిస్తూ గురువారం భీమవరంలోని సీపీఎం కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో స్మార్ట్ మీటర్స్ ఏర్పాటు చేయాలని భావిస్తే అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక స్మార్ట్‌మీటర్లను ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాన్ని ప్రజానీకమంతా వ్యతిరేకించాలని గోపాలన్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ



జాతీయ సమైక్య శిబిరంలో ప్రతిభ కనబరచిన బైట్ కళాశాల విద్యార్థులు

పాలకోడేరు: భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పెన్నాడ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కె.మనోహర్, పి.పావని ఈ నెల 21 నుంచి 27 వరకు అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ, జోర్హత్‌లో జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. ఈ శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి సంస్కృతి, సమైక్యత, నైపుణ్య లక్షణాలు, దేశభక్తి తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు, ప్రాక్టికల్స్, తదితర అంశాలలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులను అకాడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా టెన్నిస్ పోటీలు


భీమవరం యూత్‌క్లబ్‌లో జరుగుతున్న టెన్నిస్ పోటీల దృశ్యం

భీమవరం: భీమవరం యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కనుమూరు సూర్యనారాయణరాజు మెమోరియల్ ఆలిండియా టెన్నిస్ అండర్–16 బాల, బాలిక టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలికల పోటీలో యూత్ క్లబ్‌లోను, బాలుర పోటీలు కాస్మోపాలిటన్‌క్లబ్‌లో గురువారం రసవత్తరంగా సాగాయి.

కుష్టు వ్యాధిపై అవగాహన


కుష్టు నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల వైద్యాధికారి డా. ఎస్. సునీల్ అధ్యక్షతన మహత్మగాంధీ వర్ధంతిని పురస్కరించి గురువారం కుష్టు వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సునీల్ మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు గ్రామాలలో కుష్టు వ్యాధి పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కలిగిన వారు ఎవరైనా ఇంటింటికీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బందికి తెలియపరిస్తే పరీక్ష చేస్తామన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఏడుగురి బైండోవర్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆచంట, పోడూరు మండలాల్లో పాత బెల్ట్‌షాపుల కేసుల్లో పట్టుబడిన ఏడుగురిని ఆచంట తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. వీరి వద్ద నుంచి ఏడాదిపాటు మద్యం విక్రయాలు చేయబోమని బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ చేసిన వారిలో కె.శ్రీనివాసరావు, కె.మసేనురావు, పి.భగత్‌సింగ్, టి.ప్రసన్నకుమార్, యు.శ్రీనివాస్, జి.బాలాజీ, పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


పుప్పాల పానకాల రావు (ఫైల్)

నరసాపురం రూరల్: పట్టణానికి చెందిన శతాధిక వృద్ధుడు పుప్పాల పానకాలరావు (102) గురువారం ఉదయం మృతి చెందాడు. సౌత్ సెంట్రల్ రైల్వే బెంగాల్‌లో చీఫ్ కంట్రోలర్‌గా పనిచేసిన ఈయన ఉద్యోగ విరమణ అనంతరం ప్రసిద్ధి గాంచిన నరసాపురం ఆదికేశవ ఎంబర్ మానార్ ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా కూడా పనిచేశారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఇరువురు కుమారులు సంతానం ఉన్నారు. తుదిశ్వాస విడిచే వరకూ పానకాల రావు తన పనులు తానే చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. పానకాలరావు మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి సుబ్బారాయుడు, ముదునూరి ప్రసాదరాజు, బండారు మాదవనాయుడు, వైఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ సంతాపం ప్రకటించారు.

కేవీకేలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెలలో తేనెటీగల పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు పత్రికా ప్రకటనలో గురువారం తెలిపారు.జాతీయ బీ బోర్డు వారి సహకారంతో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమంలో తేనెటీగల పెంపకం, తేనె సేకరణ, మైనం, పుప్పొడి సేకరణ, కుట్టని తేనెటీగల పెంపకం మొదలగు అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. అలాగే శిక్షణ సమయంలో తేనె ఉత్పత్తుల వద్దకు, తేనె పరిశోధాన ప్రాంతాల సందర్శన కూడా నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా కేవీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. లేదా 99896 23823 నంబర్‌కు ఫోన్ చేసి మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు.

